
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 17 అక్టోబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	236	266
సూర్యాపేట	రూ.145	220	250
నల్లగొండ	రూ.131	190	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 । కనిష్ఠం 23.0

త్వరలో నల్లగొండలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ



నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తేమశాతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతు సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): త్వరలో నల్లగొండలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆయిల్ పామ్ వల్ల మంచి దిగుబడి, లాభాలు ఉన్నందున రైతులు దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది 10వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ప్రతీ ఎకరాకు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో 10లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందన్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలో



ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తున్నామని, నల్లగొండలో కూడా త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని, పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 1.50కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం సాగైందని, దేశానికి అన్నం పెట్టేలా రాష్ట్రం మారిందన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసేందుకు నిర్ణయించామని, అందుకే సన్నరకాలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ రైతులకు ఇస్తున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఏపీలోని అనంతపురం తరువాత రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో అత్యధికంగా బత్తాయి సాగవుతోందని, జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో బత్తాయి తోటలున్నాయన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24గంటల్లో కొనుగోళ్లు పూర్తి చేసి డబ్బు చెల్లించే ఏర్పాట్లు చేస్తామన్నారు. బత్తాయి మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీని ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలకు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 152 కేంద్రాలు ప్రారంభించామన్నారు. పత్తి కొనుగోలుకు జిల్లాలోని 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా, రెండు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ఏడాది 3,52,000 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశామని, బుధవారం పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్‌హౌసింగ్ చైర్మన్ నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రమేష్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, మార్కెటింగ్ జిల్లా అధికారి ఛాయాదేవి, ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా
ఏమైంది?


- ఈ పోస్టులు జనరల్ కేటగిరీ అభ్యర్థులతో భర్తీ
- అర్హతలున్నా ఆరుగురిని డీఈవో పట్టించుకోకపోవడంపై విమర్శలు
- వెరిఫికేషన్‌లో సర్టిఫికెట్లు పరిశీలించి కూడా ఉద్యోగాలివ్వలేదని అభ్యర్థుల ఆందోళన
- కోర్టును ఆశ్రయిస్తామంటున్న అభ్యర్థులు



నిరసన తెలుపుతున్న స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు

నల్లగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల నియామకాల్లో జిల్లాలో స్పోర్ట్స్ కోటా ఎంపిక విధానంపై దుమారం చెలరేగుతోంది. జీవో 74కు విరుద్ధంగా, వెరిఫికేషన్ ను సైతం పట్టించుకోకుండా పోస్టులు కేటాయించడంతో పాటు, అర్హులే లేరని ఆరు పోస్టులను జనరల్ కేటగిరీతో భర్తీ ఎంపికచేయడంపై అర్హులైన స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో స్పోర్ట్స్ కోటా కింద ఏడు పోస్టులకు మంగళవారం జరిగిన కౌన్సిలింగ్‌లో ఒక్కరినే ఎంపికచేశారు. మిగిలినవారందరినీ అనర్హులుగా ప్రకటించి, ఆ ఆరు పోస్టులను జనరల్ కోటాతో భర్తీ చేశారు. ఈ ఏడు పోస్టులకు నిబంధనల ప్రకారం 21 మంది అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో ఎంపికచేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచారు. జీవో 74 ప్రకారం స్పోర్ట్స్ కోటాలో ఎంపిక కావాలంటే ఫాం-1 (ఇంటర్నేషనల్ అసోసియేషన్), ఫాం-2 (నేషనల్ అసోసియేషన్), ఫాం-3 (యూనివర్సిటీస్), ఫాం-4 (ఎస్‌జీఎఫ్) సర్టిఫికెట్ ఉండాలి. జీవో 74 ప్రకారం ఫాం-4 ఉంటే డీఎస్సీ-2024లో ఎస్జీటీగా అవకాశం కల్పించాలి. అయితే తాజాగా, శాట్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) నిబంధనల ప్రకారం ఫాం-1, ఫాం-2 ఉంటేనే స్పోర్ట్స్ కోటాలో ఎంపికచేయాలని సూచించారని, ఈ సర్టిఫికెట్లు ఉన్నవారినే మిగతా 8వ పేజీలో...

చేపా.. చేపా.. ఎందుకిలా అయ్యావ్



- మూసీలో పెరిగే చేపలతో అనారోగ్యం
- భారలోహాలతో ప్రమాదపు అంచున ప్రజలు
- పండించిన ఆహార పదార్థాలతోనూ ముప్పు

చేపా.. చేపా.. ఎందుకిలా అయ్యావ్.. కదల్లేక పోతున్నా
ఎందుకు కదల్లేక పోతున్నావ్.. నీరు స్వచ్ఛంగా లేదు
నీరు నీరు.. ఎందుకు స్వచ్ఛత కోల్పోయావ్.. కాలుష్యంతో నిండిపోయా
నాడు జీవనదిగా ఉండి.. నేడు ఎందుకిలా అయ్యావ్
మనుష్యులు నా నీటిని కలుషితం చేశారు
మనిషి.. మనిషి..ఎందుకు కలుషితం చేశావ్.. నేనేం చేయలేదు.
వ్యర్థ రసాయనాలు వచ్చి చేరాయి.
వ్యర్థ రసాయనాలు.. ఎందుకొచ్చి చేరాయి.. పరిశ్రమలు పంపితే నేనేం చేయ..
పరిశ్రమలు మీరెందుకు కాలుష్య కారకాలు పంపుతున్నారు. ఔనా.. మేమా..?
మూసీ కాలుష్యంపై ఇదీ ప్రస్తుత పరిస్థితి..

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

మూసీ నది ఒకప్పుడు రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు జీవనాడి. స్వచ్ఛమైన నీటికి మారుపేరు. నేడు మనిషి మనుగడకే ప్రమాదకారిగా మారింది. మూసీనది పరివాహక ప్రాంతంలో చేపలు పెంచుతున్నారు. హైదరాబాద్ నగరంతోపాటు సరిహద్దు జిల్లాల ప్రజలు చేపలను అత్యంత ఇష్టంగా తింటారు. జిల్లాలోని 22 పరివాహక ప్రాంతాల్లో చేపపిల్లలను వదిలిపెడతారు. అయితే విషతుల్యంగా మారిన మూసీ నీటిలో పెరిగిన చేపలు ఆరోగ్యకరమైనవే అని తెలుసుకునేందుకు ఉస్మానియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మూసీ చేపలపై పరీక్షలు జరిపారు. అయితే మూసీలో పెరుగుతున్న చేపలు అత్యంత ప్రమాదకరమని ఉస్మానియా యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. మూసీ చేపలపై జరిగిన పరిశోధనలో భయంకరమైన నిజాలు బయటపడ్డాయి. ఇక్కడి నీటిలో పెరిగే చేపల్లో మనిషి ఆరోగ్యానికి హానీ కలిగించే ప్రమాదకర భార లోహాలు ఉన్నట్లు వెల్లడించాయి. ఇవి బ్యాక్టీరియాకంటే అత్యంత ప్రమాదకరమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇక్కడి జలచరాల్లో గూడు కట్టుకున్న భారలోహాలు బ్యాక్టీరియాకంటే అత్యంత శక్తివంతమైనవిగా శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. భారలోహాలు కలిగి ఉన్న మూసీ చేపలు తింటే మనిషి ఆరోగ్యానికి అత్యంత హాని కలిగిస్తాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

పరిశోధన సాగింది ఇలా..

యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాల గతంలో చెరువు నుంచి మూసీ చేపలను సేకరించారు. యాసిడ్స్‌లో డైజిన్ చేసి ఆ తర్వాత చేప బరువు పరిమాణాన్ని నమోదు చేసుకున్నారు. తల, మొండెం భాగాలను వేరు చేశారు. తలభాగం 360 మిల్లీ గ్రాములు, మధ్య భాగం 450 మిల్లీగ్రాముల చొప్పున మొత్తం 810 మిల్లీగ్రాముల బరువు ఉన్న చేపల భాగాలను మొత్తంగా చూర్ణంచేసి, ఆ తర్వాత వేర్వేరుగా వివిధ రకాలుగా యాసిడ్స్‌లో వేసి డైజిన్ చేశారు. అనంతరం పరీక్ష నాళికల్లో వేసి పరీక్షలు జరిపారు.

చెరువుల్లో చేపలు, గడ్డిమేసే పశువులు..

ప్రస్తుతం మూసీ అంటేనే ఓ కాలకూట విషమన్న అభిప్రాయం. మూసీ నదిలో క్యాన్సర్ కారక ఆర్సెనిక్, క్రోమియం, కాపర్, నికెల్, లెడ్ తదితర రసాయనాలను పలు పరిశోధన సంస్థలు తమ పరిశీలనలో గుర్తించాయి. ఈ నీటితో పండించే పంట ఉత్పత్తుల్లో భార లోహాలున్నట్లు తేల్చారు. చెరువుల్లో చేపలు, గడ్డిమేసే పశువులు, నీళ్ల తాగే పక్షులు సైతం పునరుత్పత్తి శక్తిని కోల్పోయినట్లు పరిశోధనలు తేల్చాయి. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీ హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో 240 కిలోమీటర్లు ప్రవహించి వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసిపోతుంది. రెండు దశాబ్దాల క్రితం స్వచ్ఛమైన నీటితో ప్రవహించి రాజధాని నగరానికేకాకుండా దిగువన ఉన్న జిల్లాల ఆయకట్టు ప్రజలకు సాగు, తాగు నీరు అందించిన ఘనత మూసీది. కాలక్రమేణా నగర జనాభా విస్తరణతోపాటు నగర శివారు ప్రాంతాల్లో.. మిగతా 6వ పేజీలో



సూదీ దారంతో స్వయం ఉపాధి

ఆదర్శంగా నిలుస్తున్న మర్రిచెట్టుతండా మహిళలు •6లో..


నకిలీ పురుగుమందుల కలకలం

- 'సింజెంటా' లేబుల్‌తో విక్రయాలు
- రూ.4లక్షల విలువైన దోమమందు స్వాధీనం
- సమాచారం అందుకున్న ఇంటలిజెన్స్ వర్గాలు

•6లో..

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఎంబీబీఎస్ సీటు

రేపటి నుంచి లతీఫుల్లా షాఖాద్రి
ఉర్సు ఉత్సవాలు



విద్యుత్ వెలుగుల్లో దర్గా స్వాగత ద్వారం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ఉన్న చారిత్రాత్మకమైన హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. ఈ ఉర్సు ఉత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల ప్రాంతాల నుంచేగాక వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. అధికారికంగా మూడు రోజులు నిర్వహించే ఉత్సవాలైనప్పటికీ నెల రోజుల పాటు ఇక్కడ సందడి ఉంటుంది. ఇప్పటికే గుట్టమెట్ల ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటయ్యాయి. దర్గా ప్రాంతం మొత్తాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. 17వ తేదీ సాయంత్రం 5.30గంటలకు స్థానిక మదీనా మసీద్‌లో గంధానికి ప్రార్థనలు చేసిన అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి రాత్రికి గుట్ట మెట్ల దగ్గరికి చేర్చడంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై గంధానికి స్వాగతం పలుకుతారు. 18న దర్గాలో దీపారాధన, భక్తులకు నిరంతర అన్నదానం, పాత కలెక్టరేట్ మసీదులో ఖురాన్ పఠనం, ప్రముఖుల సందేశాలు ఉంటాయి. 19న రాత్రి గుట్ట మెట్ల వద్ద కళాకారుల ఖవ్వాలి ఉంటుంది. ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీరు, ఇతర వసతులు కల్పించినట్లు దర్గా ముతవళ్లులు సయ్యద్ సమిఉల్లాఖాద్రీ, సల్మాన్ ఖాద్రీ తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- కేంద్రాల నిర్వహణ లోపిస్తే చర్యలు
- డీఆర్‌డీవో పీడీ శేఖర్ రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలపరిధిలోని భైరవునిబండ, నూలగడ్డ, కొత్తపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 150కి పైగా కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందని తెలిపారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తేమలేని ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని సూచించారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీనెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఏపీఎం జానకి, మార్కెటింగ్ ఎస్‌సీఆర్‌పీ దాసరి శాంత, ఏవో సౌమ్య శృతి, ఏపీవో జంగమ్మ, ఈసీ వెంకటాచారి, ఏఈవో వీరేష్, కాంగ్రెస్ నాయకులు దండ అశోక్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలల యజమానులు, విద్యార్థులు

దేవరకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమానులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం మూడేళ్లుగా స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల సంఘం నాయకులు జంగయ్య, నర్సింహ, శ్రీనివాస్, మల్లిఖార్జున్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి



కేతేపల్లి పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీచేసి వివరాలు అడిగితెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

- డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

కేతేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రాంత వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ఓపీ, ఇన్‌పేషంట్ల రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు చెందిన గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని, అందులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి అర్చన, హెల్త్ సూపర్‌వైజర్లు పి.మేరి, వెంకన్న, రోజారమణి, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిట్యాలరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టిమర్తి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, స్వామివారికి నవ కలశ స్థాపన, పంచామృత అభిషేకాలు, అలంకరణ, హోమం, నివేదన, తదితర పూజాకార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. గురువారం స్వామివారి తిరుకల్యాణాన్ని నిర్వహించనున్నారు. పూజల్లో ఆయల చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, గుత్తా శ్రీధర్‌రెడ్డి, దామనూరి రమేష్, లెంకల పాపిరెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎస్) మండలంలో విస్తరిస్తున్న

మద్యనిషేధ స్ఫూర్తి

- గట్టికల్, ఇస్తాళపురం బాటలో పాతర్లపహాడ్
- గ్రామంలో మద్యనిషేధ కమిటీ ఆధ్వర్యంలో తీర్మానం, అమలు
- బుధవారం బెల్ట్‌షాపుల నిర్వాహకులకు కౌన్సెలింగ్



పాతర్లపహాడ్‌లో మద్యపాన నిషేధ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థుల ర్యాలీ

ఆత్మకూరు(ఎస్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలో మద్యనిషేధానికి మరో గ్రామం ముందడుగు వేసింది. మద్యంతో జరుగుతున్న నష్టాలను ప్రజలు గ్రహించి మద్యపాన నిషేధం దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే మండలంలో గట్టికల్, ఇస్తాళపురం గ్రామాల్లో మద్యనిషేధం అమలవుతోంది. వాటి స్ఫూర్తితో పాతర్లపహాడ్ గ్రామంలో మద్యనిషేధం అమలుకు గ్రామస్థులు తీర్మానించారు. ఇందుకోసం అఖిలపక్షాలు ఐక్యమయ్యాయి. అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతిని పాతర్లపహాడ్ గ్రామంలో మద్యపాన నిషేధం కోసం ఆవిర్భవించిన మద్యపాన నిషేధ కమిటీ సారథ్యంలో బుధవారం గ్రామంలో మద్యపాన నిషేధం అమల్లోకి వచ్చింది. మద్యపానంతో జరుగుతున్న నష్టాలను గుర్తించి మాజీ ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీల నాయకులు, యువజన సంఘాలు, విద్యావంతులు అంత ఏకతాటిపైకి వచ్చి ప్రజలకు వివరిస్తున్నారు. బుధవారం మద్యపాన కమిటీ చైర్మన్ దొంతగాని కరుణాకర్ సామర్థ్యంలో బెల్ట్‌షాప్ నిర్వాహకులతో, పోలీస్ సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అధికారులు, గ్రామస్థులు కలిసి బెల్ట్‌షాప్‌ల వద్దకు వెళ్లి మద్య నిషేధంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులను స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గణపారపు సత్యం, కేశబోయిన మల్లయ్య, గుంటూరి వీరన్న, సంద జానయ్య, పరాల వెంకన్న, గుండాల శ్రీశైలం, జహీర్‌బాబా, గణేష్, సైదులు, రవిందర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మైహోం సిమెంట్ పరిశ్రమకు ఇండియన్ స్టాండర్డ్స్ అవార్డు



హైదరాబాద్‌లో సంస్థ తరుపున అవార్డు అందుకుంటున్న సంస్థ ప్రతినిధి విజయభాస్కర్‌రెడ్డి

మేళ్లచెర్వు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ తయారీలో ఉన్నత నాణ్యతా ప్రమాణాల విభాగంలో ఇండియా స్టాండర్డ్స్ ఆఫ్ బ్యూరో మైహోం సిమెంట్స్ పరిశ్రమకు అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేసినట్లు సంస్థ హెడ్ ఎన్ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మైహోం సంస్థకు కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీ డాక్టర్ మల్సూర్, రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ నుంచి సంస్థ సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఇండియన్ బ్యూరో స్టాండర్డ్స్ నిర్దేశించిన సూచనలు, ప్రమాణాలతో సిమెంట్ ఉత్పత్తి చేస్తుండటంతో ఈ అవార్డు దక్కిందన్నారు. ఉద్యోగుల సమష్టి కృషి, యాజమాన్యం సహకారంతో అవార్డు సాధ్యమైందని ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఎంపీ చామలకు మహారాష్ట్ర ఎన్నికల బాధ్యతలు



ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహారాష్ట్ర చంద్రాపూర్ ఎంపీ ప్రతిభ ధనోర్కర్

నల్లగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం అక్కడి చంద్రాపూర్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. చంద్రాపూర్‌లో బుధవారం జరిగిన ఆర్నీ, వాణి, వరోరా(భద్రావతి) అసెంబ్లీ నియోజకవర్గాల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో చామల పాల్గొని మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి మహారాష్ట్రలో అధికారంలోకి తేవాలని సూచించారు. కార్యకర్తల బలంతోనే తెలంగాణలో కాంగ్రెస్ విజయం సాధించిందని, మహారాష్ట్రలోనూ అధికారంలోకి రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రాపూర్ సమావేశానికి వెళ్లిన ఎంపీ చామలకు చంద్రాపూర్ ఎంపీ ప్రతిభ ధనోర్కర్, మాజీ ఎమ్మెల్యే వామన రావు కసావర్ తదితరులు స్వాగతం పలికారు.

ఇద్దరు కార్యదర్శులు, గిర్దావర్ సస్పెన్షన్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నూతనకల్ మండలంలో వివాహ ధ్రువీకరణ తప్పుడు పత్రాలు జారీచేసిన ఘటనలో ఇద్దరు పంచాయతీ కార్యాదర్శులను, ఒక అదనపు గిర్దావర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్‌నంద లాల్ పవార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 11మంది అనర్హులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారనే వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణకు కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో, నూతనకల్ తహసీల్దార్ విచారణ చేసి 11 మంది అనర్హులుగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన దరిసెనపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మిరియాల పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయకుండా చెక్కులు అందజేసినందుకు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యహరించిన నూతనకల్ అదనపు గిర్దావర్ లక్ష్మీప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



సూదీ దారంతో స్వయం ఉపాధి



- ఆదర్శంగా నిలుస్తున్న మర్రిచెట్టుతండా మహిళలు ● కుట్లు, అల్లికలతో సంప్రదాయ దుస్తుల తయారీతో ఉపాధి ● ఇతర రాష్ట్రాల్లోనూ మంచి గిరాకీ ● గ్రామానికి వచ్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

అదో మారుమూల తండా. అక్కడ ఉండే గిరిజనులంతా సంప్రదాయ దుస్తులను ధరిస్తుంటారు. ఆ ఆచార, సంప్రదాయాలే వారికి ఉపాధిగా మారాయి. తమ సంప్రదాయ దుస్తులు తామే కుట్టుకోవడం అక్కడి వారికి ఉన్న అలవాటు. ఆ అలవాటును ఉపాధిగా మలిచింది ఓ సంస్థ. సంప్రదాయాల దుస్తులతో పాటు అలంకారానికి ఉపయోగించే వస్తువులు తయారుచేస్తూ జీవితానికి ఆర్థిక భరోసాను పొందేలా తీర్చిదిద్దింది. 150 ఇళ్లు ఉన్న ఆ తండాలో ప్రస్తుతం 100 ఇళ్లు సంప్రదాయ దుస్తులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నాయి. వారు తయారు చేసిన దుస్తులకు ఇతర రాష్ట్రాల్లోనూ మంచి డిమాండ్ రావడంతో వ్యాపారులే గ్రామానికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి- దేవరకొండ)







మర్రిచెట్టుతండా గిరిజన మహిళలు తయారు చేసిన సంప్రదాయ వస్త్రాలు, ఇతర అలంకరణ వస్తువులు



నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మర్రిచెట్టుతండాలో గిరిజన మహిళలు సంస్కృతీ, సంప్రదాయాలను పాటిస్తూ స్వశక్తితో సంప్రదాయదుస్తులు, అలంకారవస్తువులు తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. ఒక్కో గిరిజన మహిళ రోజుకు కుట్లు, అల్లికలతో రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తున్నారు. తండాలో 150 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. 100 మందికిపైగా గిరిజనులు సూదీ దారం కుట్లతో దుస్తులను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో పాటు వివిధడిజైన్లతో చేతిఅల్లికలతో చేసిన దుస్తులు ఆకట్టుకుంటున్నాయి. 90శాతంపైగా సూదీదారం, చేతితోనే అల్లికలతో తయారుచేస్తున్నారు. మర్రిచెట్టుతండా గిరిజనులతో పాటు బొల్లిగుట్టతండా, నసర్లబావితండా, దుబ్బతండాలకు చెందిన మహిళలు కూడా మర్రిచెట్టుతండాకు వచ్చి కుట్లు, అల్లికలు నేర్చుకొని ఉపాధి పొందుతున్నారు. ఓ వైపు వ్యవసాయ పనులు చేసుకుంటూనే మరోవైపు కుట్లు, అల్లికలతో తయారు చేసిన దుస్తులు విక్రయించి లబ్ధిపొందుతున్నారు.

తీజ్ పండుగతో పెరిగిన ఆదరణ

గిరిజనుల యువతులకు తీజ్‌పండగ ఎంతో ముఖ్యం. ఆ పండగతో పాటు సేవాలాల్ పండగను గిరిజనులు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు.తీజ్ వేడుకలలో సంప్రదాయ దుస్తులు ధరించి యువతులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ క్రమంలో ఆయా దుస్తులకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేటీయా(లంగా), జాకెట్(కాలీ), తూక్రీ(ముసుగు) వస్త్రాలు, గజ్జెలు, పూసలతో దుస్తులను యువతులు ధరిస్తుంటారు. డిమాండ్ ఉన్న ఆయా దుస్తులను తయారు చేసి మహిళలు ఉపాధిపొందుతున్నారు. వస్త్రాల తయారు కోసం ముడిసామాగ్రిని దేవరకొండలోని రంగిరీజ్ బజార్, హైదరాబాద్‌లోని మార్వాడి దుకాణాల్లో కొనుగోలు చేసి తీసుకువస్తారు.

ఇతర రాష్ట్రాల్లోనూ మంచి డిమాండ్

మర్రిచెట్లుతండా మహిళలు తయారు చేస్తున్న సంప్రదాయ దుస్తువులకు, వస్తువులకు మంచి డిమాండ్ ఉంది. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఆదరణ లభిస్తోంది. దీంతో వ్యాపారులే తండాకు చేరుకొని గిరిజనులకు ముందుగా కొంత డబ్బులు అడ్వాన్స్‌గా చెల్లించి దుస్తులు, అలంకార వస్తువులు తయారుచేశాక ఆయా వస్తువులను ఇతర రాష్ట్రాల్లో విక్రయాలు చేస్తున్నారు. ఒక్కొక్కటి రూ.2 వేల నుంచి 3వేలవరకు కొనుగోలు చేసి వ్యాపారులు హైదరాబాద్, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, పూణె, తెలంగాణలోని మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ ప్రాంతాలలో విక్రయాలు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు. ఇదిలా ఉండగా దేవరకొండ యాక్షన్‌ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు ఖాజా ఖైరత్ ఆధ్వర్యంలో పలు పర్యాయాలు గిరిజనులు తయారుచేస్తున్న దుస్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అవగాహన కల్పించారు. సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు పాటిస్తూ చేతితోనే దుస్తులు, అలంకార వస్తువులు తయారు చేస్తూ గిరిజన మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. తాము తయారు చేసిన దుస్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

50 మందికి అల్లికలు నేర్పించా



వస్త్రాలు, ధారం, అద్దాలు, సామాగ్రి కొనుగోలు చేసి స్వయంగా దుస్తులను కుట్టుకుంటాం. 50 మందికి దుస్తులను కుట్టడం నేర్పించా. రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు ఆదాయం వస్తుంది. ఇంటి వద్దనే సంప్రదాయ పద్ధతిలో అల్లికలు, కుట్లు నిర్వహిస్తా.

- నేనావత్ చాంది, మర్రిచెట్టుతండా

సంప్రదాయ దుస్తువులకు పెరిగిన ఆదరణ



సంప్రదాయ దుస్తువులు, అలంకార వస్తువులకు రోజు, రోజుకూ ఆదరణ పెరుగుతోంది. మేం తయారు చేసిన దుస్తులను వ్యాపారులే వచ్చి కొనుగోలు చేసుకొని తీసుకెళ్తున్నారు. ప్రభుత్వమే దుస్తులను కొనుగోలు చేసి ఉపాధి కల్పించాలి.

- నేనావత్ మ్యాంగిబాయి, మర్రిచెట్టుతండా

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



మర్రిచెట్టుతండాలో 100మందికిపైగా మహిళలు స్వశక్తితో సంప్రదాయ దుస్తులు, అలంకరణ వస్తువులు తయారుచేస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులు తండాకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ప్రోత్సహించాలి.

నేనావత్ శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ మర్రిచెట్టుతండా


చేపా.. చేపా.. ఎందుకిలా..

(మొదటి పేజీ తరువాయి)

పుట్టగొడుగుల్లా వెలిసిన రసాయన పరిశ్రమల్లో మూసీ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. కాలుష్య నివారణకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోని కారణంగా మూసీ అత్యంత ప్రమాదకర కాలుష్య నదుల్లో దేశంలోనే 22వ స్థానంలో నిలిచింది. ఇంతటి దారుణ పరిస్థితికి చేరడానికి రసాయన పరిశ్రమల వ్యర్థాలన్నీ మూసీలోకి వదిలి పెట్టడంవల్లే, అంతేకాకుండా హైదరాబాద్ నగరం నుంచి ప్రతీ రోజు విడుదలవుతున్న జలాల్లో అనేక రకాల రసాయనాలతో కూడిన వ్యర్థాలు కలుస్తున్నాయి. నదీ జలాల్లో పరీక్షలు జరుపగా బయాలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీవోడీ) లీటర్‌కు 3 ఎంజీ ఉండాల్సి ఉండగా, మూసీలో లీటర్‌కు 35 ఎంజీ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. అంటే ఇక్కడి మూసీ నీళ్లు ఎంత కాలుష్యమో అర్థం చేసుకోవచ్చు. దీనివల్ల మూసీ పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. ఇక్కడి గ్రామాల్లో పండించే వరి పంటలు, కూరగాయలు, ఆహార పద

ప్రమాదకరమైన ఐదు భారలోహాలు

శాస్త్రవేత్తలు వెల్లడించిన పరిశోధనల్లో మూసీ నీటిలో పెరిగిన 800 గ్రాముల చేపకు పరీక్షలు జరపగా ప్రమాదకరమైన ఐదురకాల భారలోహాలు లెడ్, మెగ్నీషియం, కాపర్, మాంగనీస్, క్రోమియం ప్రమాదకరస్థాయిలో ఉన్నట్లు తేల్చారు. లెడ్ (సీసీం)7.299 మిల్లీ గ్రాములు, మెగ్నీషియం 15.109 మిల్లీ గ్రాములు, కాపర్ 0.234 మిల్లీ గ్రాములు, మాంగనీస్ 0.027 మిల్లీ గ్రాములు, క్రోమియం 0.380 మిల్లి గ్రాములతో కలిపి మొత్తం 23 గ్రాముల భార లోహాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో లెడ్ అత్యంత ప్రమాదకరమని, చేపలు ఎంత ఉడికించినా ఈ లోహాల ప్రభావం తగ్గదని వెల్లడించారు. దీనిని ప్రపంచవ్యాప్తంగా నిషేధించారని తెలిపారు. 0.5మిల్లీ గ్రాముల లెడ్ ఉంటేనే ఆరోగ్యానికి హానికరమని ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్నాయి. అయితే ఇక్కడి చేపల్లో లెడ్ ఏకంగా 7.299 మిల్లి గ్రాములకు పైనే ఉంటుందంటే ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు.



కాలుష్య చేపలు తినడం అత్యంత ప్రమాదకరం

మూసీ నీటిలో పెరుగుతున్న చేపల్లో మనిషి ఆరోగ్యానికి హానికరమైన భారలోహాలు ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడయ్యాయి. కాలుష్యంతో కూడిన చేపలు తినడంవల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మూసీ నదిలో చేపల్లో ఎవి మెటల్స్ లెడ్, మెగ్నీషియం, కాపర్, మాంగనీస్, క్రోమియం వంటి భారలోహాలు మోతాదుకు మించి ఉన్నాయి. భారలోహాలు శరీరంలోకి చేరి జీర్ణం కాకుండా... ఇటు బయటకు వెళ్లకుండా అక్కడే తిష్టవేసి వ్యాధులకు కారణమవుతాయి. దీని వల్ల కిడ్నీ, లివర్, గుండెపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. శ్వాసకోశ వ్యాధులు, గుండెపోటు, కిడ్నీల వ్యాధులు సోకే ప్రమాదముంది. మహిళల్లో గర్భసంచిపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

డాక్టర్ బాబురావు, పర్యావరణవేత్త

కాలుష్య జలాలతో జీవనోపాధిపై ప్రభావం



హైదరాబాద్ నగరశివారులోని అత్యంత కాలుష్యమైన రసాయనాలు మూసీలో వదులుతున్నారు. తద్వారా మూసీ జలాలన్నీ కాలుష్య బరితంగా మారుతున్నాయి. మూసీ పరివాహక ప్రాంతాల్లోని చేపలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. దీంతో వారి జీవనోపాధిపై తీవ్రంగా ప్రభావం పడుతుంది. ఈ ప్రాంతంలోని చేపలు వండిన రెండుగంటల్లోనే కూర కుళ్లిపోవడం, రుచికరంగా లేకపోవడం, అనారోగ్యానికి గురిఅవుతున్నారు. శాస్త్రవేత్తల తేల్చిన పరిశోధనల్లోనూ వెల్లడైంది. మత్స్యకారులకు శుద్ధమైన జలాలను పంపిణీ చేయాలి.

పిట్టల అశోక్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

నకిలీ పురుగుమందుల కలకలం

- 'సింజెంటా' లేబుల్‌తో విక్రయాలు
- రూ.4లక్షల విలువైన దోమమందు స్వాధీనం
- సమాచారం అందుకున్న ఇంటలిజెన్స్ వర్గాలు
- మిర్యాలగూడ డివిజన్‌లో ఘటన


మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నకిలీ పురుగు మందుల వ్యవహారం వెలుగుచూసింది. పట్టణంలోని గణేష్ మార్కెట్ సమీపంలోని ఓ ఫెస్టిసైడ్స్ దుకాణంలో బుధవారం సుమారు రూ. 4లక్షల విలువైన నకిలీ పురుగు మందులను సదరు కంపెనీ ప్రతినిధులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడకు చెందిన ఓ వ్యాపారికి అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన ఫెస్టిసైడ్స్ దుకాణం నిర్వాహకుడు ఫెస్టిసైడ్స్ మందుల దిగుమతికి సంబంధించి అప్పుపడ్డాడు. కొద్దినెలలుగా అప్పు చెల్లించకపోవడంతో ఇటీవల మిర్యాలగూడ వ్యాపారి అడవిదేవులపల్లికి చెందిన వ్యాపారి దుకాణంలో నిల్వ ఉన్న పురుగు మందులను అప్పుకింద లెక్కగట్టి తెచ్చుకున్నాడు. వీటిని పట్టణంలోని గణేష్ మార్కెట్ సమీపంలో ఉన్న తన మిత్రుడికి సరఫరాచేసి విక్రయించి సొమ్ము చేయాలని కోరాడు. దీంతో సదరు వ్యాపారి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన ఓ రైతుకు సింజెంటా కంపెనీకి చెందిన చెస్ పురుగు మందు విక్రయించాడు. పిచికారీ సమయంలో మందు నీటిలో కలువకుండా గడ్డగట్టడంతో అనుమానించి కంపెనీ సేల్స్ ఆఫీసర్(ఎస్‌వో)కు ఫిర్యాదు చేశాడు. దీంతో సిజెంటా కంపెనీ ఎస్‌వో తమ కంపెనీ ప్రతినిధులకు సమాచారమిచ్చి వ్యవసాయాధికారుల సమక్షంలో విచారణకు వచ్చారు. దీంతో నకిలీ మందు గుట్టు రట్టయ్యింది. అడవిదేవులపల్లికి చెందిన వ్యాపారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా నుంచి నకిలీ మందులను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు గుర్తించారు. ఈ దందాలో ప్రమేయం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతోపాటు ఇంజలిజెన్స్ అధికారులకు సింజెంటా కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఎంబీబీఎస్ సీటు

- కుమారుడి సీటుకోసం తండ్రి నిర్వాకం
- భార్య పేరునూ మార్చేసిన వైనం
- సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో నిర్వాకం
- కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దుచేస్తూ గెజిట్ విడుదల చేసిన కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆయనో డిప్యూటీ డీఎంహెచ్‌వో. కుమారుడి ఎంబీబీఎస్ సీటుకోసం కులం పేరు, ఆయన భార్య పేరు మార్చడంతో ప్రస్తుతం చర్చనీయాంశమయ్యారు. కర్పూరం హర్షవర్ధన్ సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయన అరుణజ్యోతి అనే ఎస్సీ కులానికి చెందిన మహిళను కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ప్రణవ్‌వర్ధన్, ప్రత్యూష్‌వర్ధన్ ఉన్నారు. అయితే హర్షవర్ధన్, ఆయన భార్య అరుణజ్యోతిల మధ్య మనస్పర్థలు రావడంతో 2017లో విడిపోయారు. దీంతో ఇద్దరు పిల్లలు తండ్రి వద్దే ఉంటూ చదువుకుంటున్నారు. అయితే 2018 వరకు బీసీ-డీ(శాతాని)గా స్కూల్ రికార్డులో నమోదు కాగా, 2019లో పాఠశాల రికార్డులో తల్లి పేరు లక్ష్మమ్మగా నమోదు చేయడమే కాకుండా ఎస్సీ(మాల) అంటూ దొంగ సర్టిఫికెట్ పెట్టి మార్పు చేయించారు. అంతేకాకుండా ఎస్సీ కోటాలో నార్కట్‌పల్లి కామినేని వైద్య కళాశాలలో పెద్ద కుమారుడు ప్రణవ్‌వర్ధన్‌కు ఎంబీబీఎస్ సీటు సంపాదించారు. దీనిపై ఎస్సీ ఐక్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గుండమల్ల మల్లేష్ ఫిర్యాదు చేయగా స్పందించిన సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్ అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అధికారి, జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి సభ్యులుగా డీఎల్‌ఎస్సీ కమిటీని విచారణ చేయాలని ఆదేశించారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టిన డీఎల్‌ఎస్సీ కమిటీ సభ్యులు తండ్రికి చెందిన బీసీ-డీ, కులం కాకుండా తల్లికి చెందిన ఎస్సీ మాల కులంపై తప్పుడు ధ్రువీకరణపత్రాలు సృష్టించినట్లు తేల్చారు. దీనిపై ఎంక్వయిరీ రిపోర్ట్‌ను జిల్లా కలెక్టర్‌కు సమర్పించగా దీనిని రద్దుచేస్తూ కలెక్టర్ గెజిట్ విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లో కోర్టుకు వెళ్లవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వ్యక్తి ఆచూకీ కోసం బంధువుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న యల్లయ్య కుటుంబ సభ్యులు

చివ్వెంల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ సుమారు 10 రోజులుగా లభించకపోవడంతో అతడి బంధువులు ఆందోళన నిర్వహించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంబటి మల్లయ్య ఆచూకీ పది రోజులుగా లేదని యల్లయ్య తల్లిదండ్రులు అంజయ్య, సుగుణమ్మ ఆరోపించారు. అతడు భార్యతో కలిసి ఈనెల 6వ తేదీన బ్యాంకులో పని ఉందని వెళ్లాడని, అప్పటి నుంచి తమ కుమారుడి ఆచూకీ తెలియరావడంలేదని వారు వాపోయారు. ఈ ఘటనలో తమకు అనుమానాలు ఉన్నాయని, ఈ విషయాలు పేర్కొంటూ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని, పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తమ కుమారుడి ఆచూకీ తెలుసుకొని అసలు బతికి ఉన్నాడో లేదో తెలపాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ బి.వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా యల్లయ్య ఆచూకి కోసం రెండు బృందాలు వెతుకుతున్నాయని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు

- గడువు ముగిసినా ఏర్పాటు కాని కమిటీలు
- రాజకీయాల కతీతంగా ఏర్పాటు చేయాలంటున్న విపక్షాలు

మోత్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు, అడ్డగూడూరుతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక కాంగ్రెస్ పార్టీలో చిచ్చురేపుతోంది. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారికి కమిటీసభ్యుల ఎంపికలో ప్రాధాన్యం ఇవ్వకుండా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని ఆ పార్టీ నాయకులు కొందరు ఆరోపిస్తున్నారు. మరికొందరు తమకు నచ్చినవారిని నియమించాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. దీంతో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో కొంత గందరగోళం ఏర్పడి జాప్యం జరుగుతుందని తెలుస్తోంది. కాగా రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని విపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ఇలా

మునిసిపాలిటీలో వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా, వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల అధ్యక్షులు ఇద్దరు(వారు కానప్పుడు గ్రూపు తీర్మానించిన ఇద్దరు సభ్యులు), గ్రామ అభివృద్ధిపై అవగాహన కలిగిన బీసీ, ఎస్సీ లేదా ఎస్టీ, జనరల్ సభ్యులు ఒక్కొక్కరు చొప్పున కమిటీలు ఏర్పాటుచేయాలి. గ్రామపంచాయతీల్లో గ్రామ పత్యేక అధికారి చైర్మన్‌గా, గ్రామకార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. మొత్తం ఏడుగురితో కమిటీ ఏర్పాటు చేయాలి.

గడువు ముగిసినా ఖరారు కాని కమిటీలు

ఇందరిమ్మ కమిటీ సభ్యుల ఎంపికను ఈ నెల 16లోగా పూర్తిచేయాల్సి ఉంది. కాగా మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో, మోత్కూరు మునిసిపాలిటీలో బుధవారం(ఈ నెల 16) నాటికి ఇందిరమ్మ కమిటీల ఎంపిక పూర్తికాలేదు. కమిటీ సభ్యుల ఎంపికకు అధికార పార్టీ నాయకులు తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. మోత్కూరు మునిసిపాలిటీలో బుధవారం ఉదయం వార్డుల వారీగా కమిటీల ఎంపికకు కసరత్తు జరగగా, సభ్యులను ఏకపక్షంగా ఎలా ఎంపిక చేస్తారని కొందరు ప్రశ్నించినట్టు తెలిసింది. సాయంత్రానికి అందరూ కలిసి సభ్యుల ఎంపిక పూర్తి చేశారంటున్నారు. ఇందిరమ్మ కమిటీల ఎంపిక పూర్తికాకపోవడంపై మోత్కూరు మునిసిపల్ కమిషనర్ సీ.శ్రీకాంత్‌ను, ఎంపీడీవో ఎండీ.నిరంజన్‌ను ప్రశ్నించగా మునిసిపాలిటీ వార్డుల్లో కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, గ్రామపంచాయతీల్లో గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపికను చేస్తున్నారన్నారు. గురువారం ఎంపిక పూర్తి చేసి జాబితాలను జిల్లా కేంద్రానికి పంపుతామన్నారు.

రాజకీయాలకతీతంగా కమిటీలు ఏర్పాటు చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక బాధ్యత ఇందిరమ్మ కమిటీలపై ఉంటుంది. రాజకీయాలకతీతంగా కమిటీ సభ్యులను ఎంపికచేయాలి. కమిటీలను పారదర్శకంగా ఎంపిక చేస్తేనే పేదలకు ఇండ్లు అందుతాయి. పూర్తిగా కాంగ్రెస్ వారితో కమిటీలు వేస్తే పేదలకు అన్యాయం జరుగుతుంది.

గుండు వెంకటనర్సు, సీపీఎం మండల కార్యదర్శి, మోత్కూరు

కమిటీల్లో అన్నిపార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలి



ఇందిరమ్మ కమిటీల్లో రాజకీయపార్టీలకు సంబంధం లేని వారినైనా నియమించాలి లేదా విపక్ష నేతలకు ప్రాతినిధ్యం కల్పించాలి. అలా కల్పిస్తేనే పేదలకు ఇండ్లు లభిస్తాయి. కాంగ్రెస్ నాయకులతో కమిటీలు వేస్తే ఇద్దరు చొక్కాలకే ఇల్లు దక్కి, నిజమైన పేదలకు అన్యాయం జరుగుతుంది.

అన్నెపు వెంకట్, సీపీఐ మండల కార్యదర్శి, మోత్కూరు

వామ్మో.. దయ్యాల గండి

● ప్రమాదకరంగా దయ్యాలగండి మూల మలుపు ● ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు ● 15 సంవత్సరాల్లో ఎనిమిది మంది మృత్యువాత


తరుచూ ప్రమాదాలు జరుగుతున్న దయ్యాలగండి మూలమలుపు

నాగార్జునసాగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రపంచ పర్యాటక కేంద్రంగా, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోంది. నాగార్జునసాగర్‌లో ప్రకృతి అందాలు, బౌద్ధ క్షేత్రం చూడడానికి దేశ, విదేశాల నుంచి ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఈ అందాలను చూసి ఆనందంగా తిరుగు ప్రయాణం కావాల్సిన పర్యాటలకును నాగార్జునసాగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మొదటి ఘాట్ వద్ద ఉన్న దయ్యాలగండి అనే ప్రాంతం భయపెడుతోంది. ఇక్కడ ప్రమాదాలు జరుగుతుంటాయి. సాగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో సమ్మక్క-సారక్క జంక్షన్ నుంచి పైలాన్ కాలనీ వరకు మొత్తం ఎనిమిది మూల మలుపులు ఉంటాయి. ఈ మూలమలుపుల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. కానీ ఎక్కువ ప్రమాదాలు దయ్యాలగండి వద్ద జరుగుతున్నాయి. ఇక్కడ మూల మలుపుతో పాటు రోడ్డుకు దగ్గరగా విద్యుత్ స్తంభాలు ఉండడంతో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకుండా చెట్లు అడ్డంగా ఉన్నాయి. ఇక్కడి రోడ్డు కూడా ఇరుకుగా ఉంది. రోడ్డు విస్తరణకు అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వక పోవడం కూడా ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది. 15 సంవత్సరాల్లో దయ్యాలగండి వద్ద 32 ప్రమాదాలు జరగగా, ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. 23మంది క్షతగాత్రులయ్యారు. అదేవిధంగా 10 ఆవులు, 30గొర్రెలు కూడా మృత్యువాత పడ్డాయి. గత నెల 18వ తేదీన జరిగిన ప్రమాదంలో ఒక లారీ, మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృత్యువాత పడింది.

దయ్యాలగండి.. ఆ పేరెలా వచ్చిందంటే..

ఆ ప్రాంతానికి దయ్యాలగండి అని పేరు ఎలా వచ్చిందని నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్మాణంలో పాలు పంచుకున్న కొందరు కూలీలను అడగగా, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో రోజూ వేల సంఖ్యలో కూలీలు పని చేసేవారని, అలా పనిచేస్తున్న క్రమంలో తరుచూ ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో కూలీలు ప్రాణాలు కోల్పోయేవారని, కూలీల మృతదేహాలను టిప్పర్ వాహనాలలో ప్రధాన డ్యాంకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న దయ్యాలగండి ప్రాంతంలో ఉన్న లోయలో పూడ్చేవారని, ఇలా ఈ ప్రాంతానికి ఆ నాడే దయ్యాలగండి అని పేరు వచ్చినట్లు వారు తెలిపారు. చనిపోయిన కూలీలను పూడ్చి వేసేందుకు సమయం లేక, అలాగే కూలీల మృతదేహాలను చూస్తే ఇతర కూలీలు పనిలోకి రారని.. అలా చేసేవారని, దీంతో ఈ ప్రాంతానికి దయ్యాలగండి అనే పేరు వచ్చిందని నాటి కూలీలు తెలిపారు. దయ్యాలగండికి మరోపేరు గాడిదల కుర్వ అని కూడా పిలిచేవారని, నాడు బరువులు మోయడానికి గాడిదలను ఎక్కువగా వాడేవారని, పనిచేసిన తర్వాత రాత్రి వేళల్లో కూలీలు తమ గాడిదలను ఈ ప్రాంతంలో ఉంచేవారని అందుకే ఈ ప్రాంతాన్ని గాడిదల కుర్వ అని కూడా అంటారని ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కూలీలుగా పని చేసిన వారు తెలిపారు.

15 ఏళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2010	3	0	5
2011	2	1	1
2012	1	10(ఆవులు)	2
2013	4	1	3
2014	4	1	1
2015	2	0	0
2016	3	0	3
2017	3	4	1
2018	2	0	2
2019	3	0	1
2020	1	0	1
2021	2	0	1
2022	0		
2023	1	30గొర్రెలు	
2024	1	1	1
	32	08	23

రోడ్డు విస్తరణకు అనుమతి ఇవ్వని అటవీశాఖ

నాగార్జునసాగర్‌కు వెళ్లే దారిలో ఉన్న మూల మలుపులు సరిచేసి రోడ్డును విస్తరించడానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్కడ రోడ్డు ఇరుకుగా కూడా ఉంటుంది. రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్లను అధికారులు తొలగించకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ఇక్కడ రోడ్డు దిగుడుగా(డౌన్) ఉంది. రోడ్డు పక్కనే రెండు విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనాలు పక్కకు వెళ్లడానికి అవకాశం లేదు. విద్యుత్ స్తంభాలు కూడా తరుచూ ప్రమాదాలు జరగడానికి మరో కారణం. ప్రమాదాల నివారణకు దయ్యాలగండి వద్ద ఫ్లైఓవర్ వేస్తే అటవీ శాఖకు ఎలాంటి నష్టం ఉండదు. అలాగే రోడ్డు కూడా వెడల్పుగా చేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన చోట ఫ్లైఓవర్ వేయకుండా అవసరంలేని చోట సమ్మక్క-సారక్క వద్ద ఫ్లైఓవర్ వేయడం వల్ల ఉపయోగం లేదని పలువురు అభి ప్రాయ పడుతున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	590.00
టీఎంసీలు	312.450
ఎడమకాల్వకు నీటి విడుదల	6022
కుడికాల్వకు	6257
విద్యుత్ కేంద్రం ద్వారా	29,191
సాగర్‌కు నీటి రాక	67,726
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	76670 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.08 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	99,112
నీటి విడుదల	99,065

- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.10 అడుగులు
టీఎంసీలు	4.22
ఇన్‌ఫ్లో	1036.38 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1407.61 క్యూసెక్కులు

- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	9 అడుగులు

- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

● నల్లగొండ జిల్లాలో సంఘటనలు


గోపయ్య(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 16: పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందాడు. బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఎర్రావులపాడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు పరికే గోపయ్య(44) అదే గ్రామానికి చెందిన మరో రైతు నామ అరుణ్‌తో కలిసి బుధవారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. వ్యవసాయ విద్యుత్ మోటార్లు పనిచేయక పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించేందుకు వెళ్లారు. అరుణ్ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్‌వైర్ ఫ్యూజులను గోపయ్య సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో పడిపోవటంతో 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గోపయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. గోపయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విద్యుత్ వైర్లు తెగి మీదపడి..


వెంకమ్మ(ఫైల్)

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వివాహిత మృతిచెందింది. ఈ సంఘటన బుధవారం నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలంలోని కొంపల్లి గ్రామంలో జరిగింది. మృతురాలి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లిగొర్ల వెంకమ్మ(54) సాయంత్రం 6.30గంటల సమయంలో తన ఇంటి ఎదురుగా ఉన్న పశువుల కొట్టంలో గేదెలకు పాలు పితికడానికి వెళ్లింది. సమయంలో కొట్టం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి గల విద్యుత్ వైర్లు చెట్ల రాపిడికి గురై తెగి ఆమె మెడ, భుజంపై పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గమనించిన ఆమె భర్త భిక్షమయ్యతోపాటు ఓంకారం ఆమెను కాపాడే ప్రయత్నం చేయగా వారికి ఎర్త్ రావడంతో భయబ్రాంతులకు గురై స్థానికులకు చెప్పారు. వారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం 108కు సమాచారం అందించగా వాహనం వచ్చేలోపు ఆమె మృతిచెందిందని నిర్ధారించుకున్నారు. దీంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకమమ చిన్న కుమారుడు రవీందర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మానసిక వ్యాధితో విద్యార్థి ఆత్మహత్య


నరేష్(ఫైల్)

ఆత్మకూరు(ఎం) అక్టోబరు 16: మానసిక వ్యాధితో బాధపడుతున్న విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో బుధవారం జరిగింది. సీఐ సాల్మన్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మెరుగు క్రిష్ణ చిన్న కుమారుడు నరేష్(19) భువనగిరిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఎంపీసీ గ్రూప్) చదువుతున్నాడు. కొన్ని సంవత్సరాల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని, కొన్ని సమయాల్లో విచిత్రంగా ప్రవర్తించేవాడని కుటుం బసభ్యులు తెలిపారు. ఇప్పటికే రెండు మూడు మార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో చికిత్స చేయిం చామని, ప్రస్తుతం మందులు వాడుతున్నాడని తెలిపారు. నరేష్ ప్రవర్తనపై అనుమాన వచ్చి అతని ఒంటరిగా వదిలిపెట్టడంలేదని ఎవరో ఒకరు రోజు కాపాలా ఉంటున్నట్లు వివరించారు. బుధవారం నరేష్ తండ్రి క్రిష్ణకు జ్వరం రాబడంతో చూయించుకోవడానికి భార్య పద్మతో భువనగిరి ఆసుపత్రికి వెళ్లారు. వారు వెళ్లే సమయంలో పద్మ తల్లి ఇంట్లో కాపలా ఉంచారు. అమ్మమ్మను బురిడి కొట్టించిన నరేష్ పక్కనున్న గదిలోకి వెళ్లి గ్యాస్ సిలిండర్ ఎక్కి ఫ్యాన్‌కు చీర కట్టి మెడకు చుట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత నరేష్ స్నేహితులు వచ్చి అమ్మమ్మను నరేష్ గురించి అడగా అప్పుడు చుట్టు పక్కల వెతికారు. చివరకు పక్కగదిలో చూడగా నరేష్ ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించాడు. కిందికి దించే సరికి నరేష్ అప్పటికే చనిపోయాడు. నరేష్ తండ్రి క్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

CLASSIFIEDS

PLOT FOR SALE

★ భువనగిరి Hotel Vivera ప్రక్కన 92 ఎకరాల మెగా వెంచర్‌లో YTDA Approved plots అమ్మబడును. బ్యాంక్ లోన్ కలదు. గజం రూ.16500/- మాత్రమే.
Contact : 8074634557

AJH-002641

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)
210/-Only
Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST
9985413365
9985413656

SURYAPET DIST
9703618713,
9985401015

YADADRI BHONGIRI DIST
9985410384

వైద్యశాఖలో ఫైళ్ల గోల!

● యాదాద్రిభువనగిరి పాత డీఎంహెచ్‌వో వద్దకే ఫైళ్లు ● బదిలీపై వెళ్లినా అక్కడికే తీసుకెళ్తున్న సిబ్బంది ● డీడీవో అధికారం లేని ప్రస్తుత ఇన్‌చార్జి


డీఎంహెచ్‌వో కార్యాయం, పాపారావు పేరుతోనే బోర్డు

భువనగిరి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా వైద్య శాఖలో విచిత్ర పరిస్థితి నెలకొంది. రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లిన అధికారిపై జిల్లా ఆధారపడి ఫైళ్లు మోసుకెళ్లి బిల్లులు మంజూరు చేయించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నా ఆ అధికారి సంతకం చేసే అధికారం లేదు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ నిర్ణయం కోసం జిల్లా వైద్య వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఇక్కడ విధులు నిర్వహించిన పాపారావు 2024 ఏప్రిల్ 1వ తేదీన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం బదిలీపై వెళ్లారు. 2024 జూలై 29న వైద్యాధికారి ఎన్. యశోదకు పరిపాలన విభాగం చార్జి ఇవ్వగా అప్పటి నుంచి ఆమె ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఎంహెచ్‌వో సంతకం కోసం అక్కడికి వెళ్లిన సిబ్బందికి గంటల కొద్ది ఎదురుచూపులు, అనేకమార్లు తిరిగిన సంతకం చేయక తిప్పి పంపడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. డీడీవో(డ్రాయింగ్ డిస్బర్సింగ్ అధికారి) అధికారాలు లేక ఉద్యోగుల వేతనాలు, పీహెచ్‌సీలు, సబ్-సెంటర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఆలస్యం అవుతున్నాయి. కాగా, ఉస్మానియా ఆసుపత్రి నుంచి టీబీ లెప్రసీ సాయిశోభ, ఎల్.బీ నగర్ నుంచి వైద్యాధికారి మనోహర్ బదిలీపై వచ్చారు. ఏడీపీహెచ్‌వోగా మనోహర్ విధులు నిర్వహించినా.. డీఎంహెచ్‌వోగా ప్రచారం జరిగింది. మూడు నెలల నుంచి డీఎంహెచ్‌వో కుర్చీ కోసం ఇద్దరు అధికారులు పోటీ పడుతుండగా, ఇందులో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల జోక్యంతో ఆ ప్రక్రియ కొలిక్కి రాలేదు. దీంతో వైద్య వర్గాలు తమకు నచ్చిన అధికారి కోసం తీవ్ర ప్రయత్నం చేస్తూ రెండు వర్గాలుగా చీలిపోయాయి. ఇప్పటి వరకు పరిపాలన విభాగం అధికారిగా కొనసాగుతున్న ఇన్‌చార్జి యశోదకే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో వివాదం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో డీఎంహెచ్‌వో నియామకం తలనొప్పిగా మారిందని వైద్యవర్గాలు ద్వారా తెలుస్తోంది. కాగా, ఇప్పటి వరకు జిల్లాలో బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. డీడీవో అధికారాలు ఎవరికి అప్పగించాలో, జిల్లాకు పూర్తిస్థాయి డీఎంహెచ్‌వో నియమించాలని ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్థికపరమైన ప్రతి ఫైళ్లను ఇక్కడి నుంచి అధికారులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల కోసం కలెక్టర్ హనుమంతు కే. జెండగే ఎదురు చూస్తున్నారు.

యాదగిరీశుడికి నిత్య పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్య పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణప్రతిష్టామూర్తులను అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకారమండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమన పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 12,03,757ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీకి చెందిన రామకృష్ణారెడ్డి లింగారెడ్డి స్వామివారి దివ్యవిమాన రాజగోపురం తాపడానికి రూ. 2,00,116 చెక్కును ఆలయ ఈవోకు అందజేశారు.

నారాయణపురంలో వ్యక్తి దారుణ హత్య


కొండయ్య మృతదేహం

మాడ్గులపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దుండుగల చేతిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని నారాయణపురం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య (64) గ్రామంలో ఇంటి వద్దనే ఉంటున్నాడు. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం మత్తులో ఆటోలో వచ్చి ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడి చేశారు. దీంతో కొండయ్య కేకలు వేయడంతో స్థానికులు రావడంతో దుండగలు పరారయ్యారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న కొండయ్య కేకలు వేయడంతో స్థానికులు ఇంట్లోకి ప్రవేశించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన కొండయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి కొండయ్యను తరలించగా అప్పటికే మృతిచెందాడు. ఈ విషయమై గ్రామంలో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసిన దుండగులు ఎక్కడి నుంచి వచ్చారు. దాడికి గల కారణాలు ఏమిటనే కోణంలో విచారణ చేస్తున్నారు. కొండయ్య హత్యతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వీరబాబు పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. కొండయ్య హత్య వెనుక భూతగాదాలు ఉన్నట్లుగా స్థానికంగా చర్చ జరుగుతోంది. కొండయ్య భార్య యాదమ్మ సుమారు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చెందింది. అప్పటి నుంచి కొండయ్య ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. కొండయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. తన ఆరు ఎకరాల స్థిరాస్తిని కుమారులు సేద్యం చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కొండయ్య మృతి వెనుక బలమైన కారణాలు ఏమిటన్న కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది. దుండగులు ఎక్కడి నుంచి వచ్చారన్న అంశంపై విచారణ చేపడుతున్నారు. గతంలో ఉన్న తగాదాలను పోలీసులు గుర్తించి హత్యకు గల కారణాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. హత్యకు పాల్పడి ఆటోలో పరారీ అయిన దుండగుల్లో ఇద్దరిని మండలంలోని ధర్మాపురం వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ సంఘటనపై కుటుంబసభ్యులెవరూ బుధవారం రాత్రి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయనట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం హత్యకు దారితీసిన కారణాలను పోలీసులు వెల్లడించనున్నారు.

హమాలీలు, ఖరీదుదారుల నడుమ బస్తాల గొడవ

● ప్లాస్టిక్ బస్తాల్లో తూకం వేయబోమని హమాలీలు ● గన్నీ బస్తాల కొరత ఉందని ఖరీదుదారుల పంతం ● వర్షం వస్తే ధాన్యం పరిస్థితి ఏమిటని రైతుల ఆందోళన


రాస్తారోకో చేస్తున్న రైతులు

తిరుమలగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీదుదారులు, హమాలీల మధ్య నెలకొన్న బస్తాల వివాదంతో తమకు నష్టం జరుగుతోందని, సమస్య పరిష్కరించాలని రైతులు జనగామ- సూర్యాపేట రహదారిపై రాస్తారోకో చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు సమీప మండలాల నుంచి 187 మంది రైతులు 12,100 బస్తాల్లో, 7,743 క్వింటాళ్ల ధాన్యం తీసుకొచ్చారు. 'ప్లాస్టిక్ బస్తాల్లో మేం తూకాలు వేయం.. వాటితో మా చేతులకు బొబ్బలు వస్తున్నాయి.. గన్నీ బస్తాలు ఇస్తేనే తూకాలు వేస్తాం.. లేకుంటే పనిలోకి రాబోమని' హమాలీలు తేల్చిచెప్పారు. గన్నీ బస్తాల కొరత ఉంది.. ప్లాస్టిక్ బస్తాల్లోనే తూకాలు వేయాల్సిందే'నంటూ ఖరీదుదారులు పంతం పట్టి వ్యవసాయ మార్కెట్‌కు రాలేదు. టెండర్ సమయం(మధ్యాహ్నం 12గంటలు) దాటుతున్నా ఖరీదుదారులు ధాన్యం కొనుగోళ్లకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఆకాశంలో మబ్బులు, వాన పడితే తమ ధాన్యం పరిస్థితి ఏమిటో తెలియక రైతుల్లో గుబులు మొదలైంది. మార్కెట్‌లో ఏం జరుగుతుందోనని అధికారులను ఆరా తీశారు. వారు చెప్పిన సమా ధానం చెప్పి వినిపోవడం రైతుల వంతైంది. ఖరీదుదారులు, హమాలీల ప్లాస్టిక్, గన్నీ బస్తాల గొడవతో టెండర్, తూకాలు ఆలస్యం కావడంతో గందరగోళానికి గురై తమ ధాన్యం పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తంచేస్తూ చేసేదేమీలేక మార్కెట్ ఎదురుగా జనగామ- సూర్యాపేట రహదారిపై రాస్తారోకో చేశారు. సాయంత్రం నాలుగు గంటల వరకు టెండర్ కాలేదని, ఆకాశంలో మబ్బులు ఉన్నాయని తాము తెచ్చిన ధాన్యం పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న తహసీల్దార్, హరిప్రసాద్, ఎస్ఐ సురేష్, మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ అక్కడికి చేరుకుని మార్కెట్ కార్యాలయంలో ఖరీదు దారులు, హమాలీలతో మాట్లాడారు. ప్రస్తుతం మా ర్కెట్లో ఉన్న ధాన్యం కాంటాలు వేయాలని ఆదేశించారు. దీంతో ఖరీదుదారులు టెండర్ ప్రారంభించి, ధాన్యం తూకాలు వేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మార్కెట్‌లో ఖరీదుదారులు, హమాలీల సమస్యపై ఉన్నతాధికారులరే నివేదిక పంపిస్తామని మార్కెట్ అధికారులు తెలిపారు. కాగా, గురువారం మార్కెట్‌కు సెలవు ప్రకటించారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రవీందర్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మేడారం గ్రామానికి చెందిన పాలకుర్తి రమణ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించగా ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రమణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాత కక్షలతో దాడి

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో పాత కక్షలను దృష్టిలోపెట్టుకొని ఎస్సీకాలనీకి చెందిన సుమారు 15 మందికిపైగా అదేగ్రామానికి చెందిన జటంగి గంగయ్యపై దాడికి పాల్పడ్డారు. సోమవారం జరిగిన ఈ సంఘటనపై మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడ్డిన వారిలో ఆరెపుల సైదులు, నవీన్, మహేష్, ముఖేష్, పేతురు, సన్నీ, విష్ణు, మరికొంత మంది పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ. శంకర్‌నాయక్ తెలిపారు.

వ్యవసాయ బోరు మోటారు తీగల చోరీ

కనగల్, అక్టోబరు 16: నల్లగొండ జిల్లా కనగల్ వాగు బ్రిడ్జి దిగువన వాగుఒడ్డు వెంట(సరిహద్దున) సుమారు 30 వ్యవసాయ బోరు మోటర్ల తీగలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం అర్థరాత్రి ఎత్తుకెళ్లారు. చోరీ చేసిన చేసిన తీగలను వాగులో ఓ చోట కాల్చి అందులోని రాగివైరును ఎత్తుకెళ్లారు. రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు. రైతులు బైరగోని అశోక్, శంకరయ్య, బుచ్చయ్య, సైదులు, గణేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారంలో పర్వతగిరి గ్రామ కల్లెడ వెంట ఉన్న బోరు మోటర్ల తీగలను కూడా దుండగులు ఇదే తరహాలో ఎత్తుకెళ్లినట్టు రైతులు వాపోయారు.

అదనపు కట్నం కేసులో జైలు శిక్ష

మిర్యాలగూడ లీగల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కేసులో నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి. నాగసుమబాల బుధవారం తీర్పు చెప్పారు. సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం గుండెబోయినగూడెం గ్రామానికి చెందిన అమరారపు శోభన్‌బాబు, మాణిక్యమ్మ, మురళీ, కాటెపల్లి కోటేశ్వర్‌రావులపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష, మొదటి నిందితుడైన శోభన్‌బాబుకు రూ.17వేలు, మిగిలిన ముగ్గురికి రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన శారదను 2018లో వివాహం చేసుకున్న అమరారపు శోభన్‌బాబు అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. అందుకు మిగిలిన నిందితులు సహకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ సదా నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా ఎస్ఐ రాములు దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సుధాకర్ కేసు వాదించారు.

రైతు ప్రయోజనాలకే ప్రభుత్వం పెద్దపీట

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిడమనూరు, హాలియా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నిడమనూరు, హాలియా మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రూ.18వేల కోట్ల రుణమాఫీని 22 లక్షల మంది రైతుల ఖతాల్లో జమచేశామన్నారు. దీపావళి నాటికి రేషన్‌కార్డులు లేని నాలుగు లక్షల మంది రైతులకు కూడా రూ.2లక్షల మాఫీ చేస్తామన్నారు. పంటల బీమాకు ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. రైతుబీమాతో పాటు రైతు భరోసాను కూడా కొనసాగిస్తామన్నారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి తనకు గురువని, ఈ నియోజకవర్గంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, రహదారుల నిర్మాణానికి జిల్లాకు రూ.516కోట్లు కేటాయించామని, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. రూ.71కోట్ల నిధులతో ముకుందాపురం నుంచి తుమ్మడం మీదుగా అల్వాల వరకు రహదారి నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ లేచేది లేదని, ఇక బీఆర్ఎస్ గెలిచేది లేదని ఎద్దేవా చేశారు. తొలుత నిడమనూరు మార్కెట్‌కమిటీ చైర్మన్ అంకతి సత్యం, వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హాలియా మార్కెట్‌కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్‌తోపాటు పాలకవర్గ సభ్యులతో డీఎంవో ఛాయాదేవి ప్రమాణం చేయించారు. తొలుత మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నిడమనూరు మార్కెట్ పాలకవర్గ సభ్యులు



హాలియా మార్కెట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు యడవెల్లి రంగశాయిరెడ్డి, కొండేటి మల్లయ్య, నందికొండ రామేశ్వరి, అంకతి వెంకటరమణ, పసుపులేటి సైదయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, వల్లభ్‌రెడ్డి, గండికోట యాదగిరి, చిన వీరయ్య, బొల్లం శ్రీనివాస్, నర్సింగు విజయ్‌కుమార్, మేరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్పీ మాజీవైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమ నరేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, కాకునూరి నారాయణగౌడ్, చిట్టిపోలు యాదగిరి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, నిమ్మల లక్ష్మారెడ్డి, కుకడాల ఆంజనేయులు, డీవీఎన్, వైన్స్ ప్రసాద్, గౌని రాజారమేష్‌యాదవ్, నాగరాజు, జెజె సైదయ్య, రామేశ్వరీ, పిల్లి ఆంజనేయులు, మందా నరేందర్‌రెడ్డి, శ్రీనుబాబు, మోహన్‌రావు, కోట నాగిరెడ్డి, చెరుకూరి కిరణ్‌కుమార్, హన్మంతరెడ్డి, సాయిరెడ్డి, రంగారెడ్డి, వెంపటి శ్రీనివాస్, డైరెక్టర్లు వీరమళ్ల శ్రీనివాస్, చిట్టిపోలు యశ్వంత్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెద్దవూర, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని రెండు రోడ్ల నిర్మాణ పనులకు మంత్రులు పెద్దగూడెం స్టేజీ, ముసలమ్మ చెట్టు స్టేజీల వద్ద బుధవారం శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని పెద్దగూడెం స్టేజీ నుంచి అనుముల మండలంలోని అన్నారం వరకు 15 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం రూ. 11కోట్లతో పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా ముసలమ్మ చెట్టు స్టేజీ నుంచి గుర్రంపోడు రహదారిపై 14కి.మీ మేర పనుల కోసం రూ. 25 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఇరిగి పెద్దులు, జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ యాకుబ్, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ సరోజ పాల్గొన్నారు.

వైద్యాధికారిగా రాజేష్‌కుమార్



రాజేష్‌కుమార్

శాలిగౌరారం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల వైద్యాధికారిగా డాక్టర్ నాగెల్లి రాజేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కట్టంగూరు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వైద్యాధికారి సూర్యశిల్ప నల్లగొండలోని పానగల్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళ్లారు. ఇదిలా ఉండగా శాలిగౌరారం రెండో వైద్యాధికారిగా డాక్టర్ వెంకటేష్ ఓగోడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి ఇక్కడికి బదిలీపై రానున్నారు.

రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం

మర్రిగూడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులు తప్ప నూతన అభివృద్ధి పనులు కనిపించడం లేదన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. టీడీపీ కార్యకర్తలు నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆయన సూచించారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న, మాజీ సర్పంచ్ ఉప్పునూతల సుగుణమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా విచారణ

చండూరు, చండూరురూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చండూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు కార్యాలయానికి సంబంధించిన రికార్డులు మాయమైన ఘటనపై విచారణ నిర్వహించారు. చండూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విచారణ నామమాత్రంగానే జరిగింది. ముగ్గురు కార్యదర్శులను పూర్తి ఆధారాలతో విచారణకు హాజరు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. కానీ అనారోగ్య కారణంతో ఒకరు హాజరు కాలేదు. మిగతా ఇద్దరు ఎలాంటి రికార్డులు లేకుండానే విచారణకు హాజరయ్యారు. దీంతో డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ముందు పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు తమకు కేవలం బీరువా తాళాలు మాత్రమే ఇచ్చారని, ఎలాంటి రికార్డులు అప్పజెప్పలేదని కార్యదర్శులు చెప్పడంతో విచారణ అధికారి విస్తుపోయారు. కార్యదర్శులు లిఖితపూర్వకంగా ఇచ్చిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కట్ట భిక్షం, పంచాయతీ కార్యదర్శి ఎండీ షఫీలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్
● పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దఅడిశర్లపల్లి, చింతపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గుడిపల్లి మండలంలోని చిలకమర్రి గ్రామ పరిధిలోని తిరుమల కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో నే ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే రైతు భరోసా రూ.7500 ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోగా రూ.2లక్షలలోపు ఉన్న రైతులకు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సిరాజ్‌ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, చం దంపేట పీఏసీఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పల్లె సత్యనారాయణ, తిలక్‌రెడ్డి, సీసీఐ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పీఏపల్లి: చిలకమర్రి వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

● చింతపల్లి: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలంలోని శ్రీశివసాయి కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన పత్తికి కనీస మద్దతు కల్పించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల యాదగిరి, కాసారం వెంకటయ్య, హరినాయక్, కృష్ణారెడ్డి, మాల్ మార్కెట్ కార్యదర్శి వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలి

దేవరకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల, లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ నీటి పారుదలశాఖ అధికారులను కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఉన్నత అధికారులతో ప్రాజెక్టుల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ప్రతిపాదించిన నేరేడుగొమ్ము మండలం గా జుబేడం లిఫ్టు, రామునోనిబండా లిఫ్టు, చందంపేట మండలంలోని చిత్రియాల లిఫ్టు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు సర్వే పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. దేవరకొండ కరువు ప్రాంతం కావడంతో ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. పెండ్లిపాకల ప్రాజెక్టు ఎత్తుపెంపు పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి రాహుల్‌బొజ్జ, కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీలు, సీఈలు, ఎస్ఈలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీఆర్‌టీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుభాష్‌చంద్ర

గట్టుప్పల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కె.సుభాష్‌చంద్ర నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పీఆర్‌టీటీఎస్ రాష్ట్ర కౌన్సిల్‌లో సమావేశంలో ఎన్నుకున్న రాష్ట్ర కార్యవర్గంలో మండలంలోని వెల్మకన్నె జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.సుభాష్‌చంద్ర పీఆర్‌టీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాజశేఖర్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన న్యాయవాది డి.రాజశేఖర్‌నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీజేపీకి ప్రజలు అండగా ఉండాలన్నారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు కేంద్రప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని అన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

మిర్యాలగూడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థికి బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌ను బుధవారం అందజేశారు. పట్టణంలోని గీతామందిర్ కాలనీకి చెందిన ముచర్ల మనీష్‌కుమార్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. స్టడీ వర్క్ చేసుకునేందుకు అవసరమైన ల్యాప్‌టాప్‌ను కొనే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన బీఎల్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బత్తుల సాయి ప్రసన్నకుమార్, బత్తుల ఈశ్వరగణేష్ నూతన ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

కార్యకర్తలపై దాడి చేస్తే సహించేది లేదు : బీఎల్ఆర్

మిర్యాలగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యకర్తలపై దాడిచేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. దామరచర్ల మండలం ఎన్ఎస్‌యూఐ నాయకుడు హరిప్రసాద్‌పై బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాడి చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం ఆస్పత్రికి వెళ్లి హరిప్రసాద్‌ను పరామర్శించారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ కవ్వింపు చర్యలు మంచివి కావని హెచ్చరించారు. ఆయన వెంట దామరచర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ ఉన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం : బీజేపీ

చింతపల్లి, మర్రిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వ హించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని వి స్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు భూస్థాపితం చేశారని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ 100 సభ్యత్వాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్, నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, నాయకులు కాసోజు బ్రహ్మాచారి, గొడ్డటి మధు, శేఖర్, జహంగీర్, మహేష్‌గౌడ్, కుందేళ్ల శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.




వీరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

● నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని అన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, పోగుల వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, నాంపల్లి సతీష్, ఈశ్వర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

నల్లగొండరూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ కృషి చేస్తుందని క్లబ్ అధ్యక్షురాలు యాస సరళా వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యాచారం పాఠశాలకు రూ.70వేల విలువైన ఫర్నీచర్ స్నేహ క్లబ్ అధ్యక్షురాలు సరళా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. 10 డ్యూయల్ డెస్క్ బెంచీలు, లైబ్రరీ ర్యాక్, బీరువా, వాలీబాల్ కిట్, ఇతర ఆట వస్తువులను అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ 320 ఈ గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో పీఎంజెఎఫ్ శివశంకర్‌రావు, సింహాద్రి, జిల్లా కేబినెట్ సెక్రటరీ లయన్ రెపాల మదన్‌మోహన్, గడ్డం ప్రదీప్‌కుమార్, రీజియన్ చైర్‌పర్సన్ నాగమణిరెడ్డి, శంకర్‌రెడ్డి, విజయలక్ష్మి, పుష్ప, చంద్రావతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

పాల ఉత్పత్తి తగ్గకుండా టీకాలు వేయించాలి

కేతేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాడి పశువుల్లో పాల ఉత్పత్తి శాతం తగ్గిపోకుండా ఉండేందుకు రైతులు తమ పాడి ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి ఎం.నవజీవన్ కోరారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో 80 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో కొప్పోలు వీఏఎస్ మల్లేష్, సిబ్బంది రసూల్, వసంత, హేమలత, గోపాలమిత్ర భిక్షం పాల్గొన్నారు.

విశ్రాంత హెడ్‌మాస్టర్ వీరారెడ్డి మృతి

కేతేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేతేపల్లికి చెందిన పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి తండ్రి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ముదిరెడ్డి వీరారెడ్డి(78) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. రెండు రోజుల క్రితం ఆయన ఆరోగ్యం విషమించడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం తీవ్రమైన గుండెపోటు రావడంతో వీరారెడ్డి మృతిచెందారు. వీరారెడ్డి మృతదేహాన్ని మంగళవారం రాత్రి పొద్దుపోయాక కుటుంబ సభ్యులు స్వగ్రామం కేతేపల్లికి తీసుకువచ్చారు. వీరారెడ్డి మృతదేహాన్ని బుధవారం ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీఎంఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీపీసీసీ కార్యదర్శి దైద రవీందర్, పలువురు పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి : జానారెడ్డి

చింతపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకులు బుధవారం హైదరాబాద్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూరె లక్ష్మణ్, బండారు సీతారాములు, పూరె బాల్‌రాజు, పర్వతాలు, సురేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చింతపల్లి, మర్రిగూడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలుసంజీవరెడ్డి అన్నారు. చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రానికి బుధవారం తేమకొలిచే పరికరంతో పాటు ప్యాడీక్లీనర్, కాంటాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రుణమాఫీ చేసిన ఘనత కేవలం సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని అన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నక్క శ్రీనివాస్, డైరెక్టర్లు, వేణుకుమార్ పాల్గొన్నారు.

● శివన్నగూడ, కుదాభక్షపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ బక్క శ్రీనివాస్, శివన్నగూడ పీఏసీఎస్ చైర్మన్ బాల నర్సింహ బుధవారం ప్రారంభించారు. రైతులు దళారీల చేతుల్లో మోసపోకుండా ఉండటానికి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మర్రిగూడ ఏవో హేమలత, వైస్‌చైర్మన్ యాదగిరిరావు, రంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, సీవో మహేందర్‌రావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శివన్నగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న తహసీల్దార్

పెద్దమ్మతల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్థుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని తాటికల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో గ్రామం ఎల్లప్పుడు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నకిరేకల్ మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, బచ్చుపల్లి గంగాధర్‌రావు, పన్నాల రాఘవరెడ్డి, పెండెం సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం మిర్యాలగూడ పట్టణంలో అద్దంకి - నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై బుధవారం జరిగింది. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సరావుపేటకు చెందిన బండారు హరిబాబు తన ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మిర్యాలగూడ మండలంలోని ఏడుకోట్లతండా వద్ద హైవేరోడ్డు డివైడర్‌పై ఉన్న చెట్ల పొదల మధ్య గడ్డిని తొలగించేందుకు స్టాపర్లను ఏర్పాటు చేసి పనులు నిర్వహిస్తున్నారు. రోడ్డుపై ఆగిఉన్న వాహనాన్ని హరిబాబు గుర్తించక ఢీకొట్టాడు. దీంతో ఆగిఉన్న వాహనానం ఇనుపరేక తాకడంతో నుదిటిపై బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని గుర్తింపు కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారమిచ్చారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో బంధువులు మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో అతడిని నర్సరావుపేటకు తరలించారు. ఈ ఘటనపై తమ కు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నాగార్జున తెలిపారు.

కొలువు దీరిన కొత్త టీచర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఇటీవల డీఎస్సీ 2024లో కొలువులు సాధించి నియామకపత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు బుధవారం కేటాయించబడిన ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పలువురు ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన బోధన అందించాలని అన్నారు. నేటి విద్యార్థులను రేపటిపౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గొప్పదన్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. ఉపాధ్యాయులకు సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

ఫరీదుద్దీన్‌కు పలువురి నివాళి

నల్లగొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఫరీదుద్దీన్ అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మహ్మద్‌అలీ పలువురు నాయకులు బుధవారం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫరీదుద్దీన్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చాడ కిషన్‌రెడ్డి, నిరంజన్‌వలీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జునరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, నాయకులు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జమాల్‌ఖాద్రీ, సయ్యద్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



ఫరీదుద్దీన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు

డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా ఏమైంది?

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిక చేస్తామని చివరలో తెలిపారని, ఈ విషయంపై అవగాహన లేక అర్హులైనవారు పలువురు వెరిఫికేషన్‌కు ముందే ఫాం-3, ఫాం-4 అప్లోడ్ చేశారని, అయితే వెరిఫికేషన్‌లో సమయంలో శాట్ నిబంధనల ప్రకారం కూడా ఫాం-1, ఫాం-2 కూడా సమర్పించారని, ఈ వివరాలను విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించకపోవడం వల్ల తామను అనర్హులుగా ఏకపక్షంగా ప్రకటించారని ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థులు వాపోతున్నారు. కేవలం నల్లగొండ జిల్లాలోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, పొరుగున ఉన్న సూర్యాపేట, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జీవో74 నిబంధనల మేరకు ఫాం-4 ప్రకారం స్పోర్ట్స్ కోటాలో ఎస్టీటీ ఉద్యోగాలిచ్చారని, ఇక్కడ మాత్రమే అర్హతలున్నా అన్యాయం చేశారని వాపోయారు. వెరిఫికేషన్ వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించకుండా తమను అనర్హులుగా ఎలా ప్రకటిస్తారని, ఈ కోటాలోని ఆరు ఉద్యోగాలను జనరల్‌కు ఎలా మారుస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై డీఈవోను సంప్రదిస్తే తనకేమీ సంబంధం లేదని, అంతా ఉన్నతాధికారుల పరిధిలోనే జరిగిందని చెబుతున్నారని అభ్యర్థులు తెలిపారు. ఒక్కో జిల్లాకు ఒక్కో నిబంధన ఎలా అమలు చేస్తారని, ఈ నిబంధనల మార్పిడి, వెరిఫికేషన్ వివరాలను పరిశీలించకుండా అప్‌లోడ్ చేసినవాటినే ప్రామాణికంగా తీసుకోవడం వెనక ఎవరి ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయో నిగ్గుతేల్చాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తాము విద్యాశాఖ రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని, కోర్టును సైతం ఆశ్రయిస్తామని అభ్యర్థులు శ్రీనివాస్, ప్రవీణ్, రమేష్, విజయ్, నీలిమ, తదితరులు తెలిపారు.

మందకృష్ణపై విమర్శలు తగవు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదిగల అభివృద్ధి, హక్కుల కోసం అహర్నిశలు పాటుపడుతున్న మందకృష్ణపై విమర్శలు తగవని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మచ్చ ఏడుకొండలు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల కాలంగా దగాకు గురవుతున్న మాదిగ ఉపకులాలకు ఉపకారం చేసేందుకు వర్గీకరణ ఉద్యమాన్ని చేపట్టిన మందకృష్ణ సఫలీకృతమయ్యారన్నారు. సుదీర్ఘ కాలం పోరాడిన కృష్ణపై అనుచిత వాఖ్యలు తగవన్నారు. సమావేశంలో నాగరాజు, శ్రీనివాస్, సురేష్, సూర య్య, రాజు, చైతన్యరెడ్డి ప్రసాద్, సుధాకర్ త దితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

దేవరకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మల పద్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం దేవరకొండ మండల ఐద్వా అధ్యక్షురాలిగా తోట రమణ, ఉపాధ్యక్షులుగా లింగంపల్లి అనిత, ప్రధాన కార్యదర్శిగా జ్యోతిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో సీఐటీయూ, ఐద్వా సంఘం నాయకులు యాదగిరి, బిజిలి లింగయ్య పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే కులగణన

నల్లగొండరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వ కులగణన చేపట్టేందుకు చర్యలు తీసుకుందని బీసీ సంక్షేమ సంఘం నాయకులు నేలపట్ల సత్యనారాయణ, కాసోజు విశ్వనాథం అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలాభిషేకం చేశారు. కులగణన చేపడుతున్న ముఖ్యమంత్రి రేవంతిరెడ్డి బీసీ సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంది సూర్యనారాయణ, కేశబోయిన శంకర్ ముదిరాజ్, చిక్కుళ్ల రాములు, నకిరేకంటి కాశయ్యగౌడ్, గుండా కోటప్ప, గంజి భిక్షమయ్య, ఆదినారాయణ, రమేష్ పాల్గొన్నారు.